రెండు గ్రామాల్లో జాతీయ కుటుంబ సర్వే

రామారెడ్డిలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రామారెడ్డి, మే 28: మండలంలోని ఉప్పల్‌వాయి, రామారెడ్డి గ్రామాల్లో మంగళవారం జాతీయ కుటుంబ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భగా బృందం బాధ్యులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, వ్యాధులు, అందుబాటులో ఉన్న వైద్య సేవలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వైద్య పథకాలతో ప్రజలు ఎంతమేరకు లబ్ధి పొందుతున్నారనే విషయాలపై సిగ్మా రీసెర్చ్ సంస్థ క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తుందన్నారు. సుమారు 14వేల ఇండ్లను సందర్శించి కరోనా సోకిన వ్యక్తులు, తీసుకున్న టీకాలు, మహిళలు, చిన్నారుల ఆరోగ్య వివరాలను నమోదు చేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో బృందం సభ్యులతోపాటు స్థానిక ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

సేంద్రియ ఎరువులను తయారు చేయాలి

రామారెడ్డి, మే 28: కంపోస్ట్‌షెడ్లలో సేంద్రియ ఎరువులను తయారుచేయాలని డీఎల్పీవో శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండలంలోని గొల్లపల్లి, అన్నారం గ్రామాల్లో ఉన్న కంపోస్ట్‌షెడ్లను ఆయన ఎంపీడీవో సవితారెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. సేంద్రియ ఎరువులు తయారు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారివెంట ఆయా గ్రామాల కార్యదర్శులు లింగాల సాగర్‌గౌడ్, గణేశ్, అరవింద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు నాగిరెడ్డిపేట వైఎస్ ఎంపీపీ ఎన్నిక

నాగిరెడ్డిపేట, మే 28: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించే ప్రత్యేక సమావేశంలో మండల ఉపాధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరాస్వామి మంగళవారం తెలిపారు. మండలలోని ఎంపీటీసీ సభ్యులు ఉదయం 10:30 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయానికి రావాలని సూచించారు. 11 గంటలకు ఉపాధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు.

నేడు లక్ష్మాపూర్‌లో కుస్తీ పోటీలు

ఎల్లారెడ్డి, మే 28: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో బుధవారం కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. గ్రామంలో బోనాలను ఊరేగింపు సందర్భంగా సాయంత్రం కుస్తీ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మల్లయోధులు పాల్గొనాలని, చివరి కుస్తీ పోటీ విజేతకు రెండు తులాల వెండి కడియం బహూకరిస్తామని తెలిపారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి

మహిళలను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రసన్న

డోంగ్లీ, మే 28: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రసన్న అన్నారు. మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని, అవసరం ఉన్న వారికి పెద్ద దవాఖానలకు రిఫర్ చేస్తామని తెలిపారు. డోంగ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు మొత్తం 3,273 మందికి ఆరోగ్య సేవలను అందించామని తెలిపారు. వారిలో 1034మందికి పలు రకాల పరీక్షలు చేశారని, ప్రత్యేక వైద్యం అవసరం ఉన్న 90మందిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మంజుల తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- దుకాణాల్లో ధరల పట్టికను ఏర్పాటు చేయాలి
- రైతులు రసీదులు తప్పకుండా తీసుకోవాలి
- పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

దుకాణంలో స్టాక్ రికార్డును తనిఖీ చేస్తున్న గాంధారి మండల వ్యవసాయాధికారి నరేశ్

రైతులకు అవగాహన కల్పిస్తున్న నాగిరెడ్డిపేట మండల వ్యవసాయాధికారి విజయశేఖర్

గాంధారి/ నాగిరెడ్డిపేట, మే 28: వానకాలం పంటలపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. విత్తన, పురుగు మందుల విక్రయ దుకాణాల్లో ధరల పట్టికలను తప్పకుండా ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయాధికారి నరేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రికార్డులతోపాటు బిల్ బుక్కులను పరిశీలించారు. దుకాణాల్లో నకిలీ విత్తనాలను విక్రయించొద్దని, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. ఎరువులను ఈ- పాస్ విధానంలోనే విక్రయించాలని సూచించారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలం చెల్లిన విత్తనాలను, పురుగుమందులను విక్రయించొద్దన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసిన అనంతరం విత్తనాలను విత్తుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి తప్పకుండా రసీదు తీసుకోవాలని నాగిరెడ్డిపేట ఏవో విజయశేఖర్ అన్నారు. వానకాలం సాగు కోసం విత్తనాల ఎంపిక, జాగ్రత్తలపై ఆయన మండలంలోని తాండూర్, రాఘవపల్లి గ్రామాల రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్, రసీదును భద్రపరుచుకోవాలన్నారు. లూజ్ విత్తనాలను కొనుగోలు చేయవద్దన్నారు. విత్తనాల ఎంపిక, సాగుపై సమస్యలు ఉంటే నేరుగా వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు నిఖిత, రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ, నాయకులు

రామారెడ్డి, మే 28: రామారెడ్డిలోని గంగమ్మవాగుపై చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో వానకాలం ప్రారంభం అవుతుందని, బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయకపోతే భీమ్‌గల్, సిరిసిల్ల, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలకు బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే దూరభారం తగ్గుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణ పనులను పట్టించుకోవడం లేదని, దీంతో కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయడం లేదని విమర్శించారు. పనులను సకాలంలో చేపట్టాలని లేదంటే ప్రజల తరపున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు ల్యాగల మహిపాల్, లింబాద్రి నాయక్, జంగం లింగం, గొర్రె శంకర్, బుద్ధ నర్సింహులు, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జీలుగ విత్తనాల పంపిణీ

రామారెడ్డి, మే 28: సదాశివనగర్ మండలంలోని అన్ని సొసైటీల్లో బుధవారం ఉదయం నుంచి జీలుగ, పెద్ద జనుము విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రజాపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరం ఉన్న రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొని సొసైటీల వద్దకు రావాలని సూచించారు.

కాటేపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

పెద్దకొడప్‌గల్, మే 28: పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలని పశువైద్యశాఖ జూనియర్ డాక్టర్ రవీందర్ రైతులకు సూచించారు. మండలంలోని కాటేపల్లి గ్రామంలో మంగళవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పశువులకు జబ్బవాపు, గొంతువాపు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ... గ్రామంలో 168 ఆవులు,185 గేదెలకు టీకాలు వేశామని తెలిపారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు రవీందర్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగిరెడ్డిపేట, మే 28: నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎస్సెస్సీ పాసైన విద్యార్థులు నేరుగా లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం గోపాల్‌పేట పాఠశాలలో ఉన్న కాలేజీలో సంప్రదించాలని సూచించారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నాగిరెడ్డిపేట, మే 28: మండలంలోని మాల్తుమ్మెద గ్రామ శివారులోని మంజీర వాగు నుంచి మంగళవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. ట్రాక్టర్‌లో వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో.. దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఉన్నతాధికారులకు సమాచారం అందజేశామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

సర్వాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి

గాంధారి, మే 28: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. మండలంలోని సర్వాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన నర్సరీని ఆయన మంగళవారం పరిశీలించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలని, మొక్కల మధ్యలో ఉన్న కలుపు మొక్కలను తొలగించాలన్నారు. వర్షాలు కురియగానే నాటేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని కంపోస్ట్ షెడ్, శ్మశాన వాటికను పరిశీలించారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

నస్రుల్లాబాద్, మే 28 : మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీవో రాము అన్నారు. మండలంలోని సంగెం, నెమ్లి గ్రామాల్లోని నర్సరీలో ఉన్న మొక్కలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని సూచించారు. మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజూ నీటిని పోసి సంరక్షించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కంపోస్ట్ షెడ్డును పరిశీలించి కంపోస్ట్ ఎరువు తయారీకి సూచనలు చేశారు. గ్రామంలో చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాని సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బీబీపేట్, మే 28 : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ బాలమణి అధ్యక్షతన బుధవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ మంగళరం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- తెలంగాణ బీసీ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ వెల్లడి
- కులగణన విధివిధానాల కోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి
- శాస్త్రీయ పద్ధతిలో కుల గణన నిర్వహించాలి

మాట్లాడుతున్న తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్

కామారెడ్డి రూరల్, మే 28 : బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వరలక్ష్మీ గార్డెన్‌లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, సామాజిక న్యాయం అందిస్తామని రాహుల్ గాంధీ, సీఎం రేవంతరెడ్డి చెప్పారన్నారు. కామారెడి విజయభేరి బహిరంగ సభలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధి రామయ్య చేతుల మీదుగా బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బీసీ కుల గణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వాగ్దానం చేశారని చెప్పారు. బీసీ కుల గణన చేపడితేనే వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, చైర్మన్ పదవులకు పెద్దపీట దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కుల గణన మర్చిపోయిందన్నారు. అందుకే వచ్చే నెల జూన్ 8వ తేదీన చలో ఇంద్ర పార్క్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అయిన కాంగ్రెస్ పార్టీ స్పందించకపోతే జూన్ 15వ తేదీన తెలంగాణ సెక్రటరేట్‌ను ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోవర్ధన్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ యాదవ్, ఆరెకటికె జిల్లా అధ్యక్షుడు బాలాజీ, గౌడ సంఘం నాయకుడు నర్సాగౌడ్, పూసల సంఘం నాయకులు రమేశ్, పద్మశాలీ సంఘం నాయకులు కాపర్తి నాగరాజు, ముదిరాజ్ సంఘం నాయకులు కాకర్ల ప్రభాకర్, నాయీ బ్రాహ్మణ నాయకులు వేణు, స్వర్ణకారు సంఘం నాయకులు ఆనంద్, మల్లేశ్‌యాదవ్, బీసీ వివిధ కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర ఆహార పౌరసరఫరాల శాఖ బృందం

భిక్కనూరు, మే 28 : భిక్కనూరు మండలం జంగంపల్లి, కాచాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్ర ఆహార పౌరసరఫరాల శాఖ బృందం మంగళవారం సందర్శించింది. అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోయిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జునబాబు, పౌర సరఫరాల శాఖ ఇన్‌చార్జి మేనేజర్ నిత్యానందం అధికారులు పాల్గొన్నారు.

ఈవోకు వినతి పత్రం అందజేత

కామారెడ్డి రూరల్, మే 28 : జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఏబీవీపీ అధ్యక్షుడు రోహిత్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈవో మసూర్ హహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డిలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలైన కెనడీ, వాగ్దేవి, గౌతమ్ మోడల్, శ్రీ చైతన్య స్కూళ్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేసిన పుస్తకాలను ప్రైవేట్ పాఠశాలల్లో విక్రయిస్తున్నారని తెలిపారు. యూనిఫామ్‌లు కూడా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎంఈవో ఎల్లయ్య, డీఈవో రాజు దృష్టికి తీసుకెళ్లినా వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈవో విన్నవించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. శ్రీచైత్య బ్రాంచ్ ఎలాంటి అనుమతులూ లేకున్నా అడ్మిషన్లు తీసుకుంటున్నారని డీఈవో, ఎంఈవో దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోలేదని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

బోర్లం గ్రామంలో సరుకులను అందజేస్తున్న ఎంపీపీ దొడ్ల నీరజారెడ్డి

బాన్సువాడ రూరల్, మే 28 : బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో ఈ నెల 26న వీచిన ఈదురు గాలులకు పేద కుటుంబాలకు చెందిన ఇండ్లు నేలకూలడంతో పాటు ఇంటి పైకప్పులు ఎగిరిపోయి నిరాశ్రయులయ్యారు. వీరికి ఎంపీపీ దొడ్ల నీరజావెంకట్రాంరెడ్డి బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి మంగళవారం నిత్యావసర సరుకులను అందజేశారు. 25 కుటుంబాలకు వివిధ రకాల సరుకులను అందజేసి అండగా నిలిచారు. కష్టకాలంలో పేదలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎజాస్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, పర్వంరెడ్డి, కాశీరాం, సయ్యద్ జలీల్, గోపన్‌పల్లి సాయిలు, మన్నెచిన్నసాయిలు, ఆనంద్, గంగారాం పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాల సమర్పణ

బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

ఎల్లారెడ్డి, మే 28: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో మంగళవారం బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటికి ఒక బోనాన్ని తీసి అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. తమ చుట్టాలు, బంధువులను పిలువడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొన్నది.

ఎల్లమ్మ కళ్యాణమహోత్సవం..

దోమకొండ, మే 28: దోమకొండ మండలం అంచనూర్‌లో నిర్వహించిన ఎల్లమ్మ కల్యాణోత్సవంలో ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజాలు చేశారు.

కూరగాయలతో కాలభైరవుడికి అలంకరణ

రామారెడ్డి, మే 28 : మండలంలోని ఇసన్నపల్లి – రామారెడ్డి గ్రామాల్లో వెలిసిన కాలభైరవుడికి వైశాఖమాసం మూడో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని కూరగాయలతో అందంగా అలంకరించారు. భక్తులకు గంజి సతీశ్ గుప్తా ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు.

రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి

బీబీపేట్, మే 28 : విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఈవోలు సాగర్, లత, రాఘవేంద్ర కలిసి బీబీపేట్‌తోపాటు ఇస్సానగర్, మాందాపూర్, జనగామ, శివారు రాంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ నుంచి అనుమతి ఉన్న షాపుల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన తర్వాత వాటికి సంబంధించిన రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.

విత్తన కొనుగోలుపై అవగాహన

రాజంపేట్, మే 28. రాజంపేటతోపాటు ఆర్గొండ, తలమడ్ల, కొండాపూర్ గ్రామాల్లో రైతులకు విత్తనాలు కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్గొండ సొసైటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సుప్రజ్యోతి మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. క్రిమి సంహారక మందులు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో గడువు తేదీ, విత్తన రకం తదితర వివరాలు గమనించాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట క్లస్టర్ ఏఈవో శ్రీకాంత్, ఆర్గొండ క్లస్టర్ ఏఈవో శిల్ప, కొండాపూర్ క్లస్టర్ ఏఈవో మానిక, తలమడ్ల క్లస్టర్ ఏఈవో మనుష్య, రైతులు పాల్గొన్నారు.

రాజంపేటలో రైతులకు అవగాహణ కల్పిస్తున్న ఏఈవో శ్రీకాంత్



ఇస్సానగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏఈవో రాఘవేంద్ర

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, MADAVEDI MOUNIKA D/o. MADAVEDI GOVARDHAN (Old Name) After Marriage changed my Name as YERROLLA LAYASRI W/o. YERROLLA PRAVEEN (New Name) R/o.H.No.4-38/2, Vill: Ravutla, Mdl: Sirikonda, Dist. Nizamabad.

WANTED

★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.